# వేంకటేశ్వరస్తవ పద్యములు

- శ్రీ వేమూరి వేంకట రామనాథం.

*రామనాథంగారి పద్యములు ఇంతకుమునుపే మనము (క)విన్నాము. వారి పద్యములలో భావము, చక్కని అలంకారములతో వినసొంపుగా, ఆలోచనాత్మకముగా ఉంటాయి. ఆయన రచనా శైలిని గురించి పూర్తిగా తెలుసుకోవాలంటే "స్వాతంత్ర్యసిద్ధి", "రామాయణ స్మృతులు", "నందనము" వంటి దీర్ఘకావ్యములు; "సంయుక్త", "నాగార్జున కొండ" వంటి పద్యనాటికలు; "చంద్ర రేఖ", "సన్నుతి", "కాదంబిని" వంటి పద్య కావ్యములు చదివితీరాలి. దైవకృపవలన ఆయన స్వాతంత్ర్యసిద్ధి, రామాయణ స్మృతులు, సన్నుతి మొదలైన రచనలనుండి కొన్ని భాగములు ఆయన చదువగా వినే భాగ్యము కలిగింది. సెయింట్‌లూయిస్‌లో పక్షమునకొకసారి జరిగే తెలుగువాణి సాహితీగోష్ఠిలో ఆయన కవిత్వము గురించి, అలంకారములను జొప్పించడమువలన దానికి కలిగే అందాన్ని గురించి విశదీకరిస్తూ, పద్యములు వ్రాయుమని యువతను ప్రోత్సహించడం గొప్ప విషయము. సందర్భమునకు తగినట్లుగా ఉత్పలమాల, చంపకమాల, శార్దూలం, మత్తేభం, ఆటవెలది, తేటగీతి, కందం, సీసపద్యములను అలవోకగా చెప్పగలగడం ఆయన ఘనత. స్వాతంత్ర్యసిద్ధిలో ఆయన జవహర్‌లాల్ నెహ్రూను గురించి ప్రస్తావిస్తూ - సూర్యుడు అస్తమించని ఆంగ్లసామ్రాజ్యముగా పేరుపడ్డ బ్రిటిష్ ప్రభుత్వ 'జవహరుడు' అని వక్కాణించడం ఆయన పదగుంఫనశక్తిని,శైలిని మనకు తెలియజేస్తాయి.*

*కలియుగ దైవమైన వేంకటేశ్వరుని స్తుతిస్తూ సంఘమిత్ర కొఱకు ప్రత్యేకముగా ఆయన వ్రాసిన రెండు పద్యములను మీకు అందిస్తున్నాము. చదివి ఆనందించండి. ||* సం||

శా. "ఏమండీ"యని వంగి పిల్చిన సరే, "యేమయ్య"యన్నన్ సరే,
"ఏమోయీ" యని చేరి పిల్చిన సరే, "యేరా"యటన్నన్ సరే,
ఆ మూలన్ నిలుచుండి ఱాయివలె, "ఊఁ( ఆ(" సవ్వడిన్ జేయకే
నీ మౌనాంకిత నిష్ఠ మున్గితివి, వందే వేంకటేశప్రభూ.

చ. తిరుపతి కొండపై కొలువు తీర్చిన దేవర, వేంకటేశ్వరా,
స్థిరమతి తోడ నిన్ను వినుతించెడు శక్తి నొసంగుమా, మనో
హరముగ నాలయాంతరము నందు నిలంబడు నీదు సొంపు తుం
పరలను జల్లుమా నిరత వర్షపరంపరవోలె నా మదిన్.

*కలియుగ దైవమైన శ్రీవేంకటేశ్వరుని కృపాకటాక్షవీక్షణలు మనపై ప్రసరించాలని ఆకాంక్షిస్తూ - సంక్రాంతి శుభాకాంక్షలతో ...*